# దెయ్యాల దిబ్బ

రచన:
భాస్కర శ్రీ

['దెయ్యాలుంటాయని నేను యిప్పటివరకూ నమ్మలేదు. ఇటుపైన కూడా నమ్మను, కాని రామచంద్రం, రామకృష్ణలని పొట్టపెట్టుకున్న దెయ్యాలు...ఇదిగో! చూడండి!']

ఏవో ఏడ్పులు! లేచి లైటు వెలిగించాను. బీరువాలోని రిష్టువాచి చూసాను. ఇంకో అర్ధగంటలో పూర్తిగా తెల్లవారిపోతుంది. నిజానికి ఎవరో ఒకరు, వదినో లేకపోతే చెల్లాయో వచ్చి లేపేవరకు లేచేవాడిని కాదు అలాంటివాడిని యివాళ అందరికంటే ముందు లేచాను. దాని క్కారణం ఆ ఏడ్పులే!

మేడమెట్లు దిగి తలుపుతీసుకొని వీధిలోకి వచ్చాను. ఎదురుగా వున్న రామారావుగారింట్లోనుండి ఏడ్పులు వస్తున్నాయ్! ఆ యింటి ముందు జనం మూగిఉన్నారు. వెంటనే నేనూ అక్కడకు వెళ్లాను. వాళ్ళమాటలను బట్టి నా ప్రియమిత్రులు, రామారావుగారి సుపుత్రులు అయిన రామచంద్రం, రామకృష్ణలు అకాల మృత్యువుకి గురి అయ్యారని తెల్సింది. పెద్ద షాక్ తగిలినట్టయింది.

గబగబా లోపలికి వెళ్లాను. రామారావుగారి యిద్దరు కోడళ్ళూ రెండు శవాలపై పడి ఏడుస్తున్నారు. రామారావుగారి పరిస్థితి మరీ దైన్యంగా ఉంది. అందరి ముఖాలమీద విచారమేఘాలావరించేయి. అంత చిన్న వయసులోనే వైధవ్యానికి బలి చేయబడ్డ ఆ అమ్మాయిల అభాగ్యంను చూడలేక అక్కడున్నవాళ్ళందరూ తలలు దించుకున్నారు.

రామచంద్రం, రామకృష్ణల శవాలను చూసాను. నల్లబడి వున్నాయి. ఎక్కడా మాటకయినా ఒక గాయంకూడ లేదు. ఈ అకాల మరణముకువీళ్ళెలా గురయ్యారో అర్థం కాలేదు. అక్కడున్న ఇద్దరు ముగ్గురిని విషయం అడిగాను.

'రాత్రి యిద్దరూ వద్దువద్దని రామారావుగారు ఎంత మొరపెట్టుకున్నా వినకుండా దెయ్యాల దిబ్బమీదున్న పొలం కాపలాకు వెళ్ళారట. పిశాచకూపం దగ్గర తెల్లవారుజామున వీరిగురించి ధైర్యం చేస్తూ వెదకటానికెళ్ళిన మా పదిమందికీ యీ పరిస్థితిలో దొరికారు. ఆ పిశాచాలకు బలి అయ్యారు!'

నాకు వారి మాటలు ఆశ్చర్యం కలిగించాయి. పిశాచాలుంటాయని, ప్రజలకు హాని చేస్తాయని విన్నాను చాలాసార్లు. విచిత్రంగా చెప్పుకునే కథలూ విన్నాను. కాని ఆ మాటలను అవంతయినా నేను నమ్మేవాడిని కాదు. అందుచేత యీ మాటలు నాకు నమ్మకం పుట్టించలేదు.

'దెయ్యాల దిబ్బమీద పిశాచాలుంటాయంటే నేను నమ్మను. నా మిత్రుల అకాల మరణానికి దెయ్యాలే మాత్రం కారకులు కావు అని నా విశ్వాసం! ఈ మరణాలకు వెనుక ఏదో మరో బలమైన కారణం వుండవచ్చు' అన్నాను.

'నీలాగనే యీ తెలివి తక్కువవాళ్ళు

రాత్రికి రాత్రి మృత్యు గుహలో నున్న ఆ దెయ్యాల దిబ్బమీది పొలం కాపలాకు వెళ్ళి యీ గతి అయ్యారు' అన్నాడు అక్కడేవున్న మా అన్నయ్య.

'నేను మాత్రం దెయ్యాలుంటాయంటే నమ్మనన్నయ్యా. ఈ చావుల వెనుకనున్న రహస్యమేమిటో యీ రాత్రి తేలుస్తాను. ఈ రాత్రి దెయ్యాల దిబ్బమీదకు వెళ్తాను' అన్నాను.

నా మాటలకు అక్కడున్న వాళ్ళందరూ ఒకరిముఖాల వంక ఒకరు చూసుకున్నారు. మా అన్నయ్య నా మాటలు విని ఒక్క సారిగా కోపం తెచ్చుకున్నారు.

'నీకు జీవించాలనే ఆశ వుంటే యీ పని వదులుకో ఇప్పుడిప్పుడే నీలాగనే యిద్దరు ప్రపంచం విడిచిపోయారు.' అన్నారు మా అన్నయ్య!

అక్కడున్న వాళ్ళందరూ యీ ప్రయత్నం విడిచిపెట్టమని చెప్పారు. భయపడయినా యీ పని విడిచిపెడ్తానని మఱికొందరు విచిత్రంగా దెయ్యాలు దిబ్బను వర్ణించారు. దెయ్యాలు అక్కడున్న పిశాచకూపం (పాడయిపోయిన నుయ్యి)లో అర్ధరాత్రప్పుడు పాటలు, పాడుతూ నాట్యం చేస్తాయట. వంద మయిళ్ళదూరంలో ఏదయినా అలికిడయితే వచ్చి ప్రాణం తీసేవరకు వదలవట. విన్నవన్నీ నన్ను భయపెట్టలేదు. సరిగదా నాలో ఆ దెయ్యాలు ఎలాగుంటాయో, వాటి కథేమిటో తెల్సుకోవాలన్న ఉత్సాహాన్ని రేచ్చ గొట్టాయి.

ఎంతకీ నేను నా పట్టుదలను విడవకుండుట చూసి విసిగిపోయి మా అన్నయ్య యిలా అన్నాడు.

'అయితే నీకూ ఒక పాడె (సప్తకట్ల పల్లకీ) కట్టిఉంచితే బాగుంటుంది:'

'అలాగే చేయండి మీకు నమ్మకం లేక పోతే! కాని నేను పోయినా వెనుక జీవించ లేక ఏడ్చే భార్యా పిల్లలెవరూ లేరు. అందు చేత మీరు నన్ను అడ్డుపెట్టకండి' అంటూ వేగంగా పెద్దపెద్ద అడుగు వేసుకొని యింట్లోకి పోయాను.

* * *

రాత్రయింది. పన్నెండుగంటలు. చలిగా ఉంది ఓవర్ కోటు వేసుకున్నాను. చెవులకు మఫ్లర్ కట్టుకున్నాను. బూట్ వేసుకున్నాను. కోటు జేబులో ఒక బేటరీలైటు వేసా. చేతితో ఒక బేటరీలైటు పట్టుకున్నాను. భుజంమీద ఒక దుప్పటి పడవేసాను. మరో చేత్తో ఒక లాఠీ పట్టుకున్నాను. ఎందకయినా మంచిదని బయటకు వచ్చాను.

రిష్టువాచీ చూసాను పన్నెండు దాటింది. అమావాస్య నాటిరాత్రి త్రోవలో నేను వేసే బేటరీలైటు కాంతితప్ప మరేకాంతీ లేదు. ఆ చీకటిలో లైటు ఆర్పేస్తే నాచేయే నాకు కనిపించుటలేదు. నే నిలా బయలుదేరగానే నా వైపు కొందరు చూడసాగేరు. కొందరు వారింప ప్రయత్నించేరు. నా అడుగులు ముందుకు సాగాయి.

పొలాల మధ్యనున్న గట్లమీదనుండి నడుస్తున్నాను, మళ్ళనిండా నీరు నిండిఉంది,

దెయ్యాలదిబ్బ యింకా వందగజాలదూరంలో ఉంది. 'దబ్'మని శబ్దమయింది. ఏదో వస్తువు నీటిలో కుటికినప్పుడు వచ్చేశబ్దమది.

ఈ సమయంలో రామారావుగారిమాటలు జ్ఞాపకం వచ్చాయి నీటిమీద నివసించే దెయ్యాలు కూడా ఉంటుంటాయి, అన్న వారి మాటను యీ సంఘటన బలపరస్తున్నట్లని పించింది. బేటరీలైటు కాంతిని నలువైపులో వేశాను, కాని ఎక్కడా ఏమీ కనిపించలేదు. ఇంకా ముందుకు వెళ్లాను. మళ్ళీ అదే శబ్దం! 'దబ్! దబ్! దబ్!'

వెంటనే నా మెదడులో ఒక చిన్న ఆలోచనవచ్చి నా గుండెలో పుట్టున్న భయాన్ని నాశనం చేసింది. చాలాచోట్ల నీటి ప్రదేశాల్లో కప్పలు బయట వుంటుంటాయని, అడుగున చప్పుడుకు నీటిలోకి దూకుతుంటాయని తట్టగానే నాలో ఉత్సాహం రెట్టింపయింది. పెద్దపెద్ద అడుగులు వేసుకుంటూ ముందుకు పోతున్నాను. నా ఊహ నిజమయింది. నా అడుగుల చప్పుడికి బెదిరి కప్పలు నీటిలోకి దూకుతున్నాయి. 'దబ్! దబ్!' శబ్దమవుతుంది. నీటిదెయ్యాలంటే యివేగదా! అనుకున్నాను.

రెట్టించిన ఉత్సాహంతో బేటరీ లైట్ కాంతిలో ముందుకు పోతున్నాను. భూతాలకూపం దగ్గరవసాగింది. కాని దెయ్యాలు పాడుకునే పాట లేమీ వినిపించలేదు. కాని కీచురాళ్ళ శబ్దం వినిపిస్తుంది. అడుగులో అడుగు వేసుకుంటూ భూతాల కూపం గట్టు దగ్గర కొచ్చాను. పాడయి పోయిన ఆ కూపంలోకి లైటింగ్ ఫోకస్ చేసాను. చెత్త చెదారం తప్ప మరేమీ కనపడలేదు. భూతాలెలాగుంటాయో తెలీదు. అందుకు అవుతాయన్న నమ్మకం లేదు. కాని కావలసిన రూపం అవి పొందగలవన్న నమ్మకం లేదు. కాని కావలసిన రూపం అవి పొందగలవన్న మాటమాత్రం నా చెవులు విన్నాయి. ఆరూపం గురించే యిప్పుడు నా కళ్ళు వెదుకుతున్నాయి.

పది నిమిషాలయింది. అటుయిటు తిరిగాను. దెయ్యాలు - గియ్యాలు ఏమీలేవని నిశ్చయించుకున్నాను. కాని రామచంద్రం, రామకృష్ణలను పొట్ట పెట్టుకున్న ఆ అదృశ్య శక్తి ఏమిటో నా కింతవరకు పట్టుపడలేదు.

ఇంతలో "బుస్" మన్న శబ్దమయింది. బేటరీను యిటే శబ్దం వచ్చిన వయిపు త్రిప్పాను "అదిగో ఆదెయ్యం వస్తుంది చూడు" అంది నామనసు. "చూస్తాను" అన్నాయి నాకళ్ళు - నలువైపులా దృష్టి సారించాను. ఏమీ కనిపించలేదు. రెండు నిమిషాలు నిశ్శబ్దం - లైటు కాంతి పడ్డా దగ్గర ఒక జీవి కనబడ్డాది. తోకమీద నాట్యం చేస్తుంది. ఇప్పుడు తెల్సింది నా మిత్రులను పొట్ట పెట్టుకున్న దెయ్యాలు ఏవో!

అదొక నాగుబాము! రామచంద్రం, రామకృష్ణలను పొట్టపెట్టుకున్నదీ పామే గదా అనుకున్నాను. నేను అంతక్రితం యిటువంటి పాము లెన్నింటినో చంపాను. అందు

(తరువాయి 26వ పేజీలో)

(20వ పేజీ తరువాయి)

చేత దీనిని చంపడం కష్టం అనిపించలేదు నాకు ఒక చేతిలో బేటరీ లైటుంది. రెండో చేతిలో లాఠీ ఉంది వీలు చూసికొడ్దామని చూస్తున్నాను. అది మాత్రం ఆ బేటరీ లైటు కాంతి పడ్తున్న దగ్గర నాట్యం చేస్తుంది. బుసలుకొడ్తుంది.

ఇంతలో మరో సర్పం వచ్చింది. ఆ రెండు సర్పాలు ఆ కాంతిలో నాట్యం చేస్తున్నాయి, ఆ రెండు భూతాలని ఎలాగ చంపాలన్న సమస్య నన్ను పీడించసాగింది, ఒక దాన్నయితే ఎలాగోలా కొట్టెయ్యవచ్చు నను కున్నాను. కాని యిప్పుడు రెండు సర్పాలు ఒకదానికి రెండోది తోడయింది. ఆలస్యం ప్రమాదమని తెలిసిగూడ స్థాణువునై అలాగే నిముషం ఉండిపోయాను.

ఇంతలో నాకో చిన్న ఉపాయం తట్టింది. నాముఖం ఆ చీకటిలో ఆనందంతో మెరిసింది. నెమ్మదిగా బేటరీ లైటును కదిపాను. వాటి బుస ఎక్కువయింది. వెంటనే బేటరీ లైటుని క్రింద వదిలేసి రెండు మూడడుగులు వెనక్కి వేసాను. ఆ రెండు సర్పాలు కోపంతో వచ్చి ఆ బేటరీ లైటుని పొడిచాయి.

వెంటనే ఆలస్యం అమృతం విషం అని గ్రహించి నా భుజం మీదనున్న దుప్పటిని వాటిమీద పరిచాను. అవి వెంటనే దుప్పటి గుడ్డలో చిక్కి గింజకుంటున్నాయి. అదే సమయమని చేతిలోని లాఠీతో ఆ సర్పభూతాల పని పట్టాను. ఈ దెయ్యాల దిబ్బమీద ఉండే భూతాలు ఏమిటో నాకు పూర్తిగా అర్థమయింది.

ఆ రెండు సర్పాలను కఱ్ఱకు తగిలించాను. బేటరీ లైటు పట్టుకుని ఇంటి ముఖం పట్టాను. చీకటిలో దూరనుండి నారాకను చూసి, భూతాలు పగపట్టి వూర్డోకి వస్తున్నాయను కున్నారో ఏమో యింట్లోకి పోయి తలుపు వేసుకోసాగారు.

మా అన్నయ్య మాత్రం వీధి గుమ్మం దగ్గర నిల్చున్నాడు క్షేమంగా నేను యింటికి చేరటం చూడగానే ఆనందంతో వచ్చి ''తమ్ముడూ'' అంటూ కౌగలించుకున్నాడు. నన్ను చూసి ఇంట్లోకి దూరిన వాళ్ళు బయటకు వచ్చారు.

''దెయ్యాలుంటాయని నేను యిప్పటి వరకూ నమ్మలేదు. ఇటుపైన గూడ నమ్మను. కాని రామచంద్రం, రామకృష్ణల్ని పొట్టపెట్టుకున్న దెయ్యాలు - ఇవిగో! చూడండి'' అని కఱ్ఱమీద నున్న చచ్చిన పాములను దిగువ పడేసాను.

వాటినిచూసి నేను చెప్పిన దంతా విన్న తరువాత అందరూ ఆశ్చర్య పోయారు.

(హిందీ కథకుడు శ్రీ వ్రజ బిహారీ వర్మ గారి ఒక కథానిక ఆధారంగా...)

Edited and Published by A. N. Raghavachar, No, 32, Krisnappa Naick Tank St., Madras-1
Printed by V Kuppuswamy Chetty, Bharathamatha Press, No. 39 Anderson St., Madars-1.